క్లుప్తంగా

నేటితో ముగియనున్న దరఖాస్తుల గడువు

శాయంపేట : తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో ఐదోతరగతి ప్రవేశాలకు నిర్వహించే ఎంట్రెన్స్ పరీక్షకు దరఖాస్తుల గడువు శనివారంతో ముగియనుందని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సుభాషిణిదేవి పేర్కొన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు ఇంకా దరఖాస్తు చేసుకోకుంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన ఎంట్రెన్స్ ఎగ్జామ్ ఉంటుందని మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా ఎంపిటీపీ బాసాని చంద్రప్రకాశ్ శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

మండలసభ వాయిదా



శాయంపేట : మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించనున్న సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. శాయంపేట, పత్తిపాక ఎంపీటీసీలు బాసాని చంద్రప్రకాశ్, గజ్జి ఐలయ్యతో పాటు ఆరుగురు సర్పంచులు, మండల స్పెషల్ ఆఫీసర్ హరిప్రసాద్, తహసీల్దార్ సుభాషిణి, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు హాజరు కావడంతో కోరం లేక వాయిదా వేసినట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

టీపీయూఎస్ మండల కమిటీ ఎన్నిక



కుమారస్వామి

దామెర : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) మండల మండల కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీతారాంపూర్ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలుగా నిర్మల, కార్యదర్శిగా సామల కవిత, మహిళా ప్రతినిధిగా గట్టు మంజుల, సమన్వయకర్తగా దాస్యం రామానుజస్వామి ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు వీరస్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 6న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, సుబేదారి పోలీసు స్టేషన్ రోడ్డు, సుబేదారి రామాలయం దేవాలయం ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేటినుంచి బ్రహ్మకుమారీల స్వర్ణోత్సవాలు

కాజీపేట అర్బన్: హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఢీ కన్వెన్షన్ హాల్‌లో శని, ఆదివారాల్లో బ్రహ్మకుమారీల స్వర్ణోత్సవాలను నిర్వహించనున్నట్లు బ్రహ్మకుమారి శ్రీదేవి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఓరుగల్లు కేంద్రంగా ఆధ్యాత్మిక సేవల్లో 50 ఏళ్ల పూర్తి చేసుకుంటున్న తరుణంలో వేడుకలను రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు వివరించారు. ముఖ్యఅతిథులుగా మంత్రులు కొండా సురేఖ, సీతక్క పాల్గొంటారని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్రకు చెందిన నాలుగు వేల మంది బ్రహ్మకుమారీలు హాజరు కానున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

భారత జాగృతి జిల్లా ఉపాధ్యక్షుడిగా కల్లూరి పవన్

హన్మకొండ: భారత జాగృతి హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా కల్లూరి పవన్‌ను నియమించినట్లు సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్, జిల్లా అధ్యక్షుడు మూల రాము గౌడ్ తెలిపారు. హనుమకొండ ఎన్జీవోస్‌కాలనీలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో హనుమకొండ నయింనగర్‌కు చెందిన కల్లూరి పవన్‌కు నియామక పత్రం అందించారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

ఖిలా వరంగల్: ఇటీవల నిర్వహించిన ఒలంపియడ్ పరీక్షల్లో వరంగల్ శంభునిపేటకు చెందిన రెనాల్డ్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈమేరకు పాఠశాల ఆవరణలో వారికి ప్రిన్సిపాల్ శ్రీధర్ శుక్రవారం సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, రాజేశ్వర్‌రెడ్డి, రామ్‌కి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం



శాయంపేట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర



దామెర : దరఖాస్తు అందజేస్తున్న వీరస్వామి



ధర్మసాగర్ : ఆన్‌లైన్ ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- దరఖాస్తులు స్వీకరించిన అధికారులు
- నేటితో ముగియనున్న ప్రజాపాలన

శాయంపేట : నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండంలోని పెద్దకోడెపాక గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. 6 గ్యారంటీల పథకంలో భాగంగా ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీని 10లక్షల రూపాయలకు పెంచడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో వికలాంగులకు రూ. 6వేల పింఛన్, మహిళలకు రూ. 2500, రైతుబంధు రూ.15వేలు అందించేందుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలో అవినీతిని అరికట్టి దోపిడి లేకుండా కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతామన్నారు. ధరణి రద్దు చేసి భూమాతను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. అర్హులైన రైతులకు పట్టాలు అందజేసి రైతుబంధు, రైతుబీమా వర్తించేలా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందించారు. అనంతరం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ హరిప్రసాద్, తహసీల్దార్ సుభాషిణి, ఏఓ గంగా జమున, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ పోలెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చల్లా చక్రపాణి, అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని మండల ప్రత్యేక అధికారి మాధవీలత అన్నారు. మండలంలోని ముస్త్యాలపల్లి, దమ్మన్నపేట్‌లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభయహస్తం ఐదు గ్యారంటీ పథకాల అమలు కోసం ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకోవాలన్నారు. శనివారంతో దరఖాస్తుల స్వీకరణ ముగియనుందని, ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ శంకర్, వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, స్థానిక సర్పంచ్ వడ్డెపల్లి శ్రీనివాస్, కేయూ తెలంగాణ ఉద్యమ నేత మంద వీరస్వామి, విద్యుత్ ఏఈ గుర్రం రమేష్, డీటీ ఖురేషి, ఆర్‌ఐలు భాస్కర్‌రెడ్డి, సంపత్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి, ఏపీఓ శారద, ఏపీఎం ఝాన్సీ గ్రామస్తులు పాల్గొన్నారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : మండల వ్యాప్తంగా చేపట్టిన ప్రజాపాలన గ్రామ సభలు శుక్రవారం ఐదోరోజుకు చేరుకున్నాయి. మండలంలో మొత్తం 19 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి రోజు అధికారులు గ్రామ సభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేసేందుకు చేపట్టిన ప్రజాపాలన గ్రామ సభల్లో నేటి వరకు 14,225 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీఓ జవహర్‌రెడ్డి వెల్లడించారు. ఇప్పటి వరకు స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తామని పేర్కొన్నారు.

పరకాలలో..

పరకాల : గతేడాది డిసెంబర్ 28వ తేదీ నుంచి ప్రారంభమైన ప్రజాపాలన దరకాస్తుల స్వీకరణ శనివారంతో ముగియనుంది. 8 రోజుల్లో మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డుల్లో 6,500 దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి తెలిపారు. వీటిలో 1000 కుటుంబాలు రేషన్‌కార్డుకు తెల్లకాగితాలపై దరకాస్తులు సమర్పించినట్లు తెలిపారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, చేయూత, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు దరఖాస్తులు సమర్పించినట్లు పేర్కొన్నారు. అర్హులందరూ వార్డుల్లో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద దరఖాస్తు ఫారాలు తీసుకోవాలని అన్నారు. ఒకే దరఖాస్తు ఫారంలో 6 గ్యారంటీలకు సంబంధించిన పథకాలకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుతో పాటు తప్పనిసరిగా రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటో ఉంటే జత చేయాలన్నారు. శనివారం సాయంత్రం 6గంటల వరకు దరఖాస్తులు సమర్పించేందుకు వీలు ఉందని, తరువాత స్వీకరించేదిలేదని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన సమయంలోపు దరఖాస్తులు అందించాలన్నారు.

పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి



ప్రేమేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రాజభద్రయ్య

పరకాల : వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా బీజేపీ నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు మున్సిపల్ మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య తెలిపారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని కలిసిన రాజభద్రయ్య.. శుక్రవారం వినతిపత్రం అందించారు. విద్యార్థి దశలో ఏబీవీపీలో చురుకుగా పాల్గొన్నానని, ఆర్ఎస్ఎస్‌లో పనిచేశానని తనను గుర్తించాలని కోరారు. అంతే కాకుండా విద్యాసంస్థను నెలకొల్పడం జరిగిందని, పరకాల మున్సిపల్ చైర్మన్‌గా ప్రజలకు 5ఏళ్ల పాటు సేవలు అందించినట్లు వివరించారు. వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని, ప్రజల ఆశీర్వాదం తనకు ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా నాయకుడు బాసాని సోమరాజ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

స్రవంతికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో పరిశోధకురాలు పోరిక స్రవంతికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఫార్మలాజికల్ స్టడీస్ ఆఫ్ సమ్ ఇండిజినెస్ మెడిసినల్ ప్లాంట్స్ ఫర్ యాంటీ బైటిక్ యాక్టివిటీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి స్రవంతికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. కళాశాల ప్రొఫెసర్ నర్సింహారెడ్డి పర్యవేక్షణలో స్రవంతి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

కాశిబుగ్గ వాసులకు డాక్టరేట్



పరంధామ



రాజ్‌కుమార్

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గకు చెందిన ఇద్దరు పరిశోధకులు హైదరాబాద్ జేఎన్‌టీయూ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. రసాయన శాస్త్రంలో 'ఎంప్యూరిటీ ప్రొ ఫీలింగ్ అండ్ సింథసిస్ ఆఫ్ ఎసిటోవని లోన్‌లో ఫ్రీడమ్ ఆర్ సాల్మెట్రోల్ జీనో ఫోర్మెట్ పోసకినజోల్ అండ్ డై హైడ్రాలజీ సల్ఫేట్' అనే అంశంపై గుడ్ల పరంధామ పరిశోధనలు చేశారు. అలాగే, రసాయన శాస్త్రంలో 'సింథసిస్ సైటోటాక్సిక్ యాక్టివిటీ అండ్ మాలిక్యులర్ డాకింగ్ స్టడీస్ ఆఫ్ టెట్రాసైక్లిక్ ఫ్యూజ్డ్ అక్రిడాన్ డెరివేటివ్స్' అనే అంశంపై రాజ్‌కుమార్ పరిశోధనలు చేశారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



అక్షింతలతో శోభాయాత్ర చేస్తున్న గ్రామస్తులు

వేలేరు : మండలంలోని పీచర గ్రామంలో అయోధ్య నుంచి వచ్చిన రాముడి అక్షింతలను హనుమాన్, వెంకటేశ్వర భజన మండలి కమిటీ సభ్యులు శుక్రవారం ఇంటింటికీ వెళ్లి శ్రీ రాముడి కరపత్రాలు, అక్షింతలు అందించారు. పీచర హనుమాన్ ఆలయంలో పూజారి స్వార్థిక్ ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రధాన వీధుల్లో అక్షింతల కలశానికి శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మ్యాక రవీందర్, ఎంపీటీసీ జల్తారి సంపత్, గ్రామ పెద్దలు దొడ్డ ఈశ్వరయ్య, అంచూరి లక్ష్మినారాయణ, ద్రాక్షపల్లి రాజు, భిక్షపతి, వెంకటేశ్, భూపతి, మనోహర్, జైపాల్, తిరుమల, యాదమ్మ పాల్గొన్నారు.

గడువులోగా దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాలి

- ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా



దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కమలాపూర్: ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి ఒక్కరూ ఇచ్చిన గడువులోగా దరఖాస్తులను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ చేయాలని ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సూచించారు. కమలాపూర్‌లోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను శుక్రవారం ఆమె సందర్శించి ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ పని తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. అంతకుముందు ఐదు గ్యారంటీ పథకాల అమలు కోసం మండలంలోని అంబాల, శ్రీరాములపల్లి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలు జరిగాయి. ఈసందర్భంగా అధికారులు ఆయా గ్రామాల్లో మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్ల తదితర ఐదు పథకాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఏడో రోజు రెండు గ్రామాల్లో కలిపి మొత్తం 3 వేల దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ గుండె బాబు, తహసీల్దార్ పి.మాధవి, ఎంపీఓ విమల, ఏఓ లక్ష్మారెడ్డి, ఏపీఎం నారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, పల్లె దవాఖాన వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి నృత్య పోటీల్లో చిన్నారికి అవార్డు



హన్మకొండ: జాతీయ స్థాయి నృత్య పోటీల్లో విద్యార్థి కె.సమీక్షా రెడ్డి ప్రతిష్టాత్మకమైన ప్రెసిడెంట్ చాయిస్ అవార్డు గెలుచుకుంది. డిసెంబర్‌లో 30, 31 తేదీల్లో ఉత్తర ప్రదేశ్‌లోని మధురలో 13వ కృష్ణరంగ్ మహోత్సవ్‌లో భాగంగా ఇంటర్‌నేషనల్ మల్టీలింగ్వల్ ప్లే డ్యాన్స్ పోటీలు జరిగాయి. అందులో కూచిపూడి విభాగంలో హనుమకొండ ఎక్సైజ్ కాలనీకి చెందిన సమీక్షా రెడ్డి అద్భుత ప్రదర్శన కనబరిచి అవార్డు గెలుచుకుంది.

మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు

ఖిలా వరంగల్: ములుగు జిల్లాలోని జగ్గన్నపేటలో రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనుసూర్య (సీతక్క)ను రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, వరంగల్ మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు బోయినిపెల్లి సంపత్‌రావు, జిల్లా అధ్యక్షుడు వెల్దండి శ్రీనివాస్, మండల కార్యదర్శి చంద్రమౌళి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్ప గుచ్ఛం అందజేసి సన్మానించారు.

ప్రభుత్వం సమగ్ర విచారణ చేయించాలి



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో లంచం తీసుకుంటూ పట్టుబడిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్యను ఉద్యోగం నుంచి తొలగించాలని, కాకతీయ యూనివర్సిటీలో జరగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్‌వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా అవినీతి అక్రమాలకు కేయూ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని ఆరోపించారు. ఒక్కరికే మూడు, నాలుగు పదవులు కట్టబెట్టడంతో అవినీతి పెరిగిపోయిందని వివరించారు. నాయకులు అశోక్, రమేష్, శ్రీను, పృథ్వీ, రాజ్‌కుమార్, శంకర్, గౌతం, శేఖర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలను పట్టించుకోని బీఆర్ఎస్

కేయూ క్యాంపస్: గత పదేళ్ల కాకతీయ యూనివర్సిటీ, వర్సిటీలోని హాస్టళ్ల, మెస్‌లు, ఎస్‌డీఎల్ సీఈ, పరీక్షల విభాగాల్లో పలు అవినీతి ఆరోపణలు వచ్చినా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వలీఉల్లాఖాద్రీ విమర్శించారు. యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలు అవినీతికి అడ్డాలుగా మారాయని అన్నారు.

హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని అక్రమాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని టీబీఎస్ఎఫ్ అధ్యక్షుడు మాలోతు వెంకన్న నాయక్ ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ యూనివర్సిటీలు అవినీతికి అడ్డాగా మారాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని తగు చర్యలు చేపట్టాలి.

బాధిత కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

మడికొండ: అనారోగ్య సమస్యలతో మృతిచెందిన మృతుడి కుటుంబ సభ్యులకు అతడి స్నేహితులు ఆర్థిక చేయూతనందించారు. మడికొండ గ్రామానికి చెందిన కల్లెపు రమేష్(50) గత నెలలో మృతి చెందారు. ఈమేరకు మృతుడి పదవ తరగతి బ్యాచ్ స్నేహితులు రూ.30వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో తోటి స్నేహితులు దండిగం రవీందర్, నల్ల ప్రవీణ్, లోకిని రవీందర్, బుర్ర రాజేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెలపై రియల్టర్ల కన్ను

- వెలసిన అక్రమ వెంచర్లు



దామెరలో వెలసిన అక్రమ వెంచర్

దామెర : పచ్చని చెట్లు, పొలాలతో ఆహ్లాదంగా కనిపించే గ్రామాలపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడింది. గుట్టుచప్పుడు కాకుండా, ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ వెంచర్లను ఏర్పాటు చేసి దందా కొనసాగిస్తున్నారు. మండల కేంద్రంలోని భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇదే అదనుగా భావించిన కొందరు అక్రమార్కుల దృష్టి రియల్ వ్యాపారం వైపు మళ్లింది. దీంతో వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రహారీగోడల నిర్మాణాలు చేపట్టి, ఇష్టారాజ్యంగా వెంచర్లను ఏర్పాటు చేస్తున్నారు. దామెర పొలిమేర చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు 163 జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ఒగ్లాపూర్, ఊరుగొండ, అదే విధంగా తక్కళ్లపహాడ్, దమ్మన్నపేటలో అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో పలు విమర్శలకు తావిస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి అక్రమవెంచర్లు ఏర్పాటు చేసిన వారిపై చర్య తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దు



అభ్యంతరాలు స్వీకరిస్తున్న అధికారులు

ఆత్మకూరు : మండలంలోని అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేసే అంశంలో పెద్దాపూర్ గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దని గ్రామస్తులు కోరారు. అక్కంపేట గ్రామం పెద్దాపూర్ రెవెన్యూ పరిధిలో ఉండగా గ్రామస్తుల అభిప్రాయం మేరకు ప్రభుత్వం అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆర్డీఓ శ్రీనివాస్ పెద్దాపూర్‌లో శుక్రవారం అభ్యంతరాల స్వీకరణ గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో గ్రామస్తులు పలు అభ్యంతరాలను అధికారులకు దృష్టికి తీసుకొచ్చారు. పెద్దాపూర్ చెరువును పెద్దాపూర్‌లోనే ఉంచాలని, సర్వే నంబర్ల తరలింపులో గ్రామానికి అన్యాయం జరగకుండా చూడాలన్నారు. ఆర్డీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎవరికి ఇబ్బంది కలుగకుండా అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక రాజు, సర్పంచ్ కమల రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి

వేలేరు : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖీ కేంద్రం లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో శుక్రవారం సఖీ కేంద్రం అందించే ఐదు రకాల సేవలను మహిళలకు వివరించారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ సహాయం, వైద్య, పోలీస్, తాత్కాలిక వసతి, న్యాయ సహాయం గురించి మహిళలకు అవగాహన కల్పించారు. గృహ హింసా, లైంగిక వేధింపులు, అత్యాచారాల నుంచి రక్షణ పొందేందుకు సఖీ సెంటర్ పని చేస్తుందని అన్నారు. సఖీ కేంద్రం సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని ఏదైనా సమస్య వచ్చినప్పుడు 181 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని తద్వారా తక్షణ సహాయం అందుతుందని అన్నారు. అనంతరం 181 వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కేస్ వర్కర్ హరిత, ఏపీఎం జయసుధ, సీసీ నిత్యానందం, అశోక్ పాల్గొన్నారు.

యాదవులు రాజకీయంగా ఎదగాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

వేలేరు : యాదవులు రాజకీయంగా ఎదగాలని ఆ సంఘం గ్రామ అధ్యక్షుడు ఆవుల రాజయ్య అన్నారు. మండలంలోని పీచర గ్రామంలో శ్రీగోదాదేవి యాదవ సంఘం క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు యాదవులను కేవలం ఓటు బ్యాంకు కోసమే వాడుకుంటున్నారని ఆరోపించారు. యాదవులు ఎవరికీ లొంగకుండా ఉండాలని, రాబోయే రోజుల్లో యాదవులకు అన్ని రాజకీయ పార్టీలు పోటీ చేసేందుకు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యాదవులందరూ ఏకమై రాజకీయంగా తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు మేకల యాదయ్య, ఉపాధ్యక్షుడు ఎర్రగొల్ల ఎల్లయ్య, కార్యదర్శి మండల సంపత్ కుమార్ ,శ్రీనివాస్, సందీప్, కొమురయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మహంకాళిమాత స్వాగత తోరణం ప్రారంభం



స్వాగత తోరణం ప్రారంభిస్తున్న విష్ణు

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన విక్టరీ యూత్ అధ్యక్షుడు బొమ్మకంటి శ్రీకాంత్ అతని భార్య ప్రియాంక జ్ఞాపకార్థం మహంకాళిమాత దేవాలయానికి స్వాగత తోరణం ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆత్మకూరు ఏఎంసీ వైస్ చైర్మన్ గజ్జి విష్ణు, నాగార్జున స్కూల్ కరస్పాండెంట్ గుర్రం అశోక్, సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య స్వాగత తోరణాన్ని ప్రారంభించారు. ముందుగా ప్రియాంక చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ప్రియాంక జ్ఞాపకార్థం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు, బస్‌స్టాప్ నిర్మాణం చేయడంతో పాటు, స్వాగత తోరణం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ బత్తిని రజిని, ఉపసర్పంచ్ సురేష్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పోశాలు, రాజు, సుభద్ర, రాజేందర్, యాదగిరి, నరేష్, సురేష్, వేణు, వాసుదేవమూర్తి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని ఎమ్మెల్యే నివాస గృహంలో శుక్రవారం పీఆర్టీయూ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని అన్నారు. అనంతరం పీఆర్టీయూ క్యాలండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు అబ్బు బుచ్చిరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎడ్ల ఉపేందర్‌రెడ్డి, సోమన్న, మండల ప్రధానకార్యదర్శి భుజంగరావు, కందకట్ల ప్రభాకర్, రాంరెడ్డి పాల్గొన్నారు.